# ఆధునిక నీతి కథలు



## తాళ్లూరు నాగేశ్వరరావు

"ఏమండీ!...." అంది పద్మప్రియ మల్లెపూలపై వెన్నెల పడ్డంత మృదువుగా.

"ఏమోయ్!" అన్నాడు సత్యసుందరం ఆఫీసుకు వెళ్ళబోతూ 'చేతక్' స్కూటరెక్కి.

ఒక ప్యాకెట్టు భర్త కందించింది. ఆ ప్యాకెట్టు చూశాడు సత్యసుందరం. పాలమీగడలాంటి వైట్ బ్యాక్‌గ్రౌండ్‌పైన టర్కాయిస్ బ్లూ కలర్‌లో సంపెంగ లతల ప్రింట్ బోర్డరూ, మధ్యలో అక్కడక్కడా అదే ప్రింట్‌తో ఆ ఆర్గెంజీ చీర బహు అందంగా, ఆకర్షణగా వుంది.

"పక్కింటి పార్వతికి వాళ్ళాయన నిన్న సాయంకాలం సుల్తాన్‌బజార్లో కొనుక్కొచ్చాడట. తొంభై అయిదు రూపాయలట. నూటపది చెప్పి, గీసిగీసి బేర మాడితే తొంభై అయిదు కిచ్చాడట...." అంది పద్మప్రియ. 'నాకూ ఒకటి కొనరూ' అన్న అర్థింపు అంతర్లీనంగా ధ్వనిస్తూండగా.

"నీకూ ఒకటి కావాలా?" అన్నాడు సత్యసుందరం ఆ కవర్ను భార్యకిస్తూ.

పద్మప్రియ మొహం వెయ్యి వోల్టుల విద్యుద్దీపంలా వెలిగింది.

"ఇవాళ జీత మొస్తుందిగా!...."

"అందుకేనోయ్ అడుగుతూంట" అన్నాడు సత్యసుందరం కొంటెగా చిరునవ్వు చిందిస్తూ.

"కొట్టువాడు ఎంత ధర చెప్పినా, అంతకే కొనండి! అదే రంగు చీర!" అంది పద్మప్రియ అంతలోనే మొహంలో రంగులు మార్చి.

"బేరాలాడటంలో పార్వతి మొగుడుకంటే పదాకులు ఎక్కువే చదివాను. వస్తా" అంటూ స్కూటర్ స్టార్టుచేశాడు సత్యసుందరం.

వీధిమలుపు తిరిగేదాకా భర్తకేసి అనురాగంతో కూడిన అప్యాయతతో చూస్తూనే వాకిట్లో నిలబడింది పద్మప్రియ.

నెలజీతం అందుకున్నాక, సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికొస్తూ సుల్తాన్ బజార్ వెళ్ళాడు సత్యసుందరం. ఆ క్లాత్ ఎంపోరియమ్ పేరు గుర్తుపెట్టుకొని అందులోకే నేరుగా వెళ్లాడు. ఆదేరంగు ఆర్గండీ చీరను బయటికి తీయించాడు. అదే చీర దొరికినందుకు ఎంతో సంతోషమేసింది.

"ఎంత?"

"నూటపాతిక."

సత్యసుందరం మనస్సు కలుక్కుమంది. ఈ రోజుల్లో అమ్మేవాళ్ళకు కొనేవాళ్ళు లోకువ అనుకుంటూ, "ఎనభై కిస్తారా?" అన్నాడు.

షాపులో గుమాస్తా అతనికేసి 'జూ'లోకి వచ్చిన కొత్త జంతువుకేసి చూసినట్టు చూశాడు వింతగా.

"మా షాపులో బేరసారాలకు తావులేదండీ! అన్నీ నిర్ణీత ధరలే. అనుమానంగా వుంటే బిల్లు చూపిస్తాను. నిన్ననే ఈ రకం చీర అమ్మాం." అంటూ షాపు గుమాస్తా బిల్లుబుక్కు తీసి, ఇరవై కాగితాలు వెనక్కు తిప్పి, ఓ బిల్లును చూపెట్టాడు.

సత్యసుందరం కళ్ళు ఆశ్చర్యంతో అరసెంటీమీటర్ వెడల్పయ్యాయి. ఆ బిల్లుమీద పార్వతి మొగుడుపేరు వ్రాసివుంది. ధర నూటపాతిక రూపాయలే! సందేహంలేదు. మరి —!

నూటపాతిక రూపాయలిచ్చి ఆ చీరను కొన్నాడు సత్యసుందరం. షాపు గుమాస్తా బిల్లు రాస్తుంటే, అక్కర్లేదని ఆ చీర ప్యాకెట్ పుచ్చుకొని స్కూటరెక్కాడు.

అదేరంగు, అదే క్వాలిటీ చీర తెచ్చినందుకు భర్తను ఎంతో మెచ్చుకుంది పద్మప్రియ.

"ఎంతకిచ్చాడు?"

"తొంభై" అన్నాడు సత్యసుందరం గంటవాయించినంత ఠంగున.

"నిజమా? - మీ రింకా గట్టిగా బేరం చేశారన్నమాట! భలేవారే!" అంది పద్మప్రియ మొగుడ్ని మొహమాటంలేకుండా మెచ్చుకొంటూ.

వానలో ఎండొచ్చినట్టు చిరునవ్వు నవ్వాడు సత్యసుందరం.

మరునాడు ఉదయం పదిగంటలకు సత్యసుందరం ఆఫీసుకు వెళ్ళేటప్పుడు పద్మప్రియ స్కూటరుదాకా వచ్చి - "సాయంకాలం వచ్చేటప్పుడు అలాంటిదే మరో చీర పట్టుకురండి" అంది భర్తతో.

"ఎందుకూ?" అన్నాడు సత్యసుందరం మూతి మూడు సెంటీమీటర్లు ముందుకు చాపి.

"మా చెల్లెలికండీ! విశాఖపట్నంలో ఈ చీరలు యింత చవుగ్గా దొరకవు. అదీ సంతోషపడుతుంది" అంది పద్మప్రియ.

విసుగ్గా 'కిక్' కొట్టి స్కూటర్ను స్టార్ట్ చేశాడు సత్యసుందరం- రెండు చీరలమీదా తన చేతి చమురును లెక్కిస్తూ.

*అమ్మేవాళ్ళల్లో కంటే కొనేవాళ్ళల్లోనే బుద్ధిహీనులు ఎక్కువ.*